క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి


సీఐ మధు

మధిర: రానున్న 48 గంటల్లో, ఆ తర్వాత కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశ మున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మధిర రూరల్ సీఐ డి.మధు అన్నారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తుఫాన్ హెచ్చరికల నేపథ్యాన మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల పరిధిలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రమాదకర పరిస్థితులు ఏర్పడితే వెంటనే పోలీసులకు, అధికారులకు సమాచారం అందించాలన్నారు.

మంత్రిని కలిసిన సబ్ కలెక్టర్


మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

కల్లూరు: కల్లూరు సబ్ కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అజయ్ యాదవ్ బుధవారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. దమ్మపేట మండలం గండుగులపల్లిలోని మంత్రి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూస్తూ, ప్రజా సమస్యలను పరిష్కరించాలని మంత్రి తుమ్మల సూచించారు. సత్తుపల్లి తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల పరామర్శ..

వైరారూరల్: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు దగ్గుపాటి సత్యనారాయణ ఇటీవల బ్రెయిన్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ, సహకార, పట్టు పరిశ్రమల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బుధవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట శ్రీరామనేని విజయ భాస్కర్, స్థానిక నాయకులు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ


స్వీట్లు అందిస్తున్న డీఎం యు.రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు ఈ నెల 7వ తేదీ నుంచి 11వరకు రూ. 1.46 కోట్లు ఆదాయం వచ్చిందని ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం డిపో ప్రాంగణంలో ఉద్యోగులను అభినందించి, స్వీట్లు పంపిణీ చేశారు. 96శాతం ఓఆర్‌తో పాటు ఈపీకే 61.38శాతం సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఎంఎఫ్ ఎస్.సాహితీ, సూపర్‌వైజర్లు బాలస్వామి, వెంకటయ్య, కిన్నెర ఆనంద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన పరికపల్లి శ్రీకాంత్, బండి విజయ్ లపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్సై నాగుల్‌మీరా తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్అండ్‌టీ ఫైనాన్స్ కంపెనీలో శ్రీకాంత్, విజయ్‌లు ఫైనాన్స్ తీసుకొని ఈఎంఐ చెల్లించకపోవడంతో.. కంపెనీ మేనేజర్ నర్సింహారావు నగదు చెల్లించాలని అడిగాడు. దీంతో కొట్టి చంపుతామని మేనేజర్‌ను బెదిరించడంతో బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

ఏన్కూరు: విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, ప్రతీ విద్యార్థి చదువుకోవాలని వయోజ విద్యా డిప్యూటీ డైరెక్టర్ అనీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఇందిరా క్రాంతిపథం కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామదీపికలు, గ్రామ సమైక్యలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్షలకు దరఖాస్తులు చేసుకోవాలని, పరీక్షల్లో పాసైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏపీఎం శ్యామ్‌కుమార్, సీసీలు, గ్రామ దీపికలు, గ్రామ సమైఖ్య సభ్యులు పాల్గొన్నారు.

108 సిబ్బందికి అభినందన

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని రుద్రాక్షపల్లికి చెందిన కె.నియాన్స్ (26 రోజుల పసికందు)కు.. ఫిబ్రవరి 5న ప్రాణాపాయ స్థితిలో ఉండగా 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యంకోసం ఖమ్మం ఆస్పత్రికి సకాలంలో తరలించడంతో చిన్నారి సురక్షితంగా బయటపడింది. దీంతో బుధవారం 108సిబ్బంది గొల్లమండల కృష్ణ, ఏకాంత్‌లను స్థానికులు అభినందించగా, చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

చినుకు పడితే.. చిత్తడే..!


అంగన్‌వాడీ కేంద్రం ఎదుట బురదమయమైన రోడ్డులో నడుస్తున్న చిన్నారులు

- కారేపల్లిలో బురదమయంగా వీధులు
- మోకాళ్లలోతులో వరద నీరు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, వాహనదారులు

కారేపల్లి: కారేపల్లిలో చినుకు పడితే చాలు.. వీధులన్నీ చిత్తడిగా మారుతున్నాయి. మోకాళ్లలోతు బురద నీటిలో గ్రామ ప్రజలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంట్లో నుంచి బయట అడుగు పెట్టాలంటే చాలు.. నానా అవస్థలు పడుతున్నారు. కారేపల్లిలోని మదీన సెంటర్ రోడ్డు, పాతశివాలయం వీధి, బీసీ కాలనీ, సంత్ సేవాలాల్, భారత్‌నగర్ కాలనీ, రజక బజార్, గౌడ్ల బజార్, ఇమ్మడి బజార్లలోని వీధుల్లో సీసీ రోడ్లు లేకపోవటంతో.. వీధులన్నీ వర్షాలకు అధ్వానంగా మారుతున్నాయి.

అధ్వానంగా పలు వీధులు..

- కారేపల్లిలోని ముత్యాలమ్మ గుడి సెంటర్ నుంచి డోర్నకల్ బైపాస్‌రోడ్డు వరకు 100మీటర్ల రహదారిలో సగం వరకు సీసీ రోడ్డు వేసి, మిగతా రోడ్డులో మొరం పోసి వదిలేశారు. ఇక అంతా వర్షం వచ్చిందంటే చాలు.. చెరువును తలపిస్తున్నాయి. ఈ రోడ్డులో రైల్వే పనులకోసమై రైల్వేట్రాక్ కోసమై సిమెంట్ దిమ్మెలతో వెళ్తున్న లారీలు ఆ దారుల్లో దిగబడుతున్నాయి.


మదీన సెంటర్ రహదారిలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

- ఇదే మార్గంలో.. సింగరేణి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, వారంతపు సంత తోపాటు.. ముత్యాలమ్మ గుడి సైతం ఉంది. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఆ దారుల్లో నడవలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.
- కారేపల్లి నడిబొడ్డులో ఉన్న మదీన సెంటర్ రోడ్డు, డోర్నకల్ బైపాస్ రోడ్డు నుంచి మసీదు సెంటర్‌కు వెళ్లే.. రోడ్డులో గోతులు పడి, డ్రెయినేజీ రోడ్డుపైకి ప్రవహించి నీరు నిల్వ ఉండి.. అధ్వానంగా తయారైంది. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందడంతో పాటు దుర్వాసన వెదజల్లుతుందన్నారు. ఈ విషయమై అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు మొరపెట్టుకున్నా.. పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

నడవలేక పోతున్నాం..



కారేపల్లిలో వీధులన్నీ బురదమయంగా మారాయి. దీంతో ప్రజలు ఇంట్లో నుంచి బయటికి వచ్చి నడవలేని పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు దోమల వృద్ధి చెందటం, పందులు స్వైర విహారం చేయటంతో వీధులన్నీ అధ్వానంగా మారి, దుర్వాసన రావడంతో ప్రజలు ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తుంది.

– షేక్ కబీర్, కారేపల్లి

సీసీ రోడ్డుగా మార్చాలి..



సింగరేణి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ముందు రోడ్డు మోకాళ్లలోతు బురదనీటితో నిండిపోయింది. దీంతో చిన్నారులు బురద నీటిలో నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులు అయితే అంగన్‌వాడీకి రావడమే మానేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని సీసీ రోడ్డుగా మార్చాలి.

– షేక్ రహమున్నీసబేగం, కారేపల్లి

ఎడతెరిపిలేకుండా వర్షం

చింతకాని: మండలంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటల్లోకి భారీగా వరద నీరు చేరుతుంది. నాగులవంచ వద్ద బండిరేవు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నాగులవంచ నుంచి పాతర్లపాడు వైపు వెళ్లే రహదారిపై రాకపోకలు నిలిపివేయటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండలంలోని చినమండవ, మత్కేపల్లి, పందిళ్లపల్లి గ్రామాల వద్ద మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇలాగే మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిస్తే మండలంలోని చెరువులు అలుగుపడి పంటలు నష్టపోయే అవకాశముందని రైతులు వాపోతున్నారు.


నాగులవంచ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బండిరేవు వాగు

తల్లాడలో..

తల్లాడ: తల్లాడలో బుధవారం సాయంత్రం ఆకాశ మేఘావృతమై వర్షం కురిసింది. రాత్రి వరకు వర్షం పడుతూనే ఉంది. దీంతో ఈ వర్షం పత్తి, వరి పైర్లకు బాగా ఉపకరిస్తుంది. వర్షం కురుస్తున్నందున బిల్లుపాడు, రామచంద్రాపురం, వెంగన్నపేట గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎస్సై వెంకటకృష్ణ పేర్కొన్నారు. బిల్లుపాడు సమీపంలో ఉన్న వాగు, వెంగన్నపేట సమీపంలో ఉన్న వాగు భారీ వర్షం కురిస్తే పొంగి ప్రవహించి రాకపోకలు స్తంబించే అవకాశం ఉందని హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

తల్లాడ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పని చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచించారు. తల్లాడ మండలంలోని 24 గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆమె 113 మంది లబ్ధిదారులకు రూ.32.73లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాన రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీ రేణుకాచౌదరి పుట్టిన రోజు సందర్భంగా తల్లాడలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల, బ్లాక్ అధ్యక్షులు కాపా సుధాకర్, దగ్గుల రఘుపతిరెడ్డి, నాయకులు దీవెల కృష్ణయ్య, నర్సింహారావు, తూము వీరభద్రరావు, కొమ్మినేని ప్రభాకర్‌రావు, రాయల రాము, తుమ్మలపల్లి రమేష్, కటికి కిరణ్, అన్నెం కోటిరెడ్డి, పగడాల లచ్చిరెడ్డి, అడపా అనీల్, గణేశల రవి, గుర్రం శ్రీనివాసరావు, మారెళ్ల మమత, గొడుగునూరి శ్రీనివాసరెడ్డి, పొట్టేటి జనార్దన్‌రెడ్డి, జోసఫ్, జక్కంపూడి కిషోర్, కేతేపల్లి బాస్కర్‌రావు, బొడ్డు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అన్నారుగూడెంలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో నందిని, నాయకులు

మధిర: మండలంలోని మహాదేవపురం గ్రామానికి చెందిన 15కుటుంబాలు బుధవారం కాంగ్రెస్ నాయకుడు నల్లపు ప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి మల్లు నందిని విక్రమార్క కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెసప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరారన్నారు. పార్టీలో చేరిన వారిలో నల్లపు పెద్ద పాపారావు, కమలాకర్, నాగార్జున, శ్రీనివాస్, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, కొత్తపల్లి నవీన్, రామాల మరియమ్మ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కిషోర్, జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

మధిర: ప్రభుత్వ ఉద్యోగుల పట్ల గుదిబండగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని యుటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించి విద్యారంగ అభివృద్ధికి పాటు పడుతున్న ఎస్టీఎఫ్ఐ ఆవిర్భవించి 25 సంవత్సరాలు నిండిన సందర్భంగా.. బుధవారం స్థానిక యుటీఎఫ్ కార్యాలయం వద్ద సంఘ పతాకాన్ని ఎం.శ్రీరాములు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన విద్యా విధానాన్ని రద్దు చేసి, ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వినోదరావు, వీరయ్య, సునీత, చెన్నయ్య, రఫీ, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు స్వాతి, హసీనా బేగం, నాయుడు భవాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ


సత్తుపల్లి: ర్యాలీ చేస్తున్న బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రామలింగేశ్వరరావు, నాయకులు


మధిర: ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

సత్తుపల్లి/మధిర: బీజేపీ ఆధ్వర్యంలో పట్టణాల్లో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లిలో, మధిరలోని స్థానిక అంబేడ్కర్ సెంటర్ నుంచి రాయపట్నం సెంటర్ మీదుగా తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా త్రివర్ణ పతాకాలతో కళాశాలల విద్యార్థులు, నాయకులు కలిసి ర్యాలీ నిర్వహించారు. సత్తుపల్లిలో 160అడుగుల పొడవు ఉన్న జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, బీజేపీ మధ్య అసెంబ్లీ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు మాట్లాడారు. స్వాతంత్రోద్యమస్ఫూర్తిని చాటి చెబుతూ, ఆపరేషన్ సిందూర్ విజయాలను స్మరించుకుంటూ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజు సుమంత్, మండల అధ్యక్షుడు శ్రీహరి చౌదరి, నాయకులు సాంబశివరావు, చంద్రశేఖర్ రెడ్డి, రమేష్, నాయుడు రాఘవరావు, సుదర్శన్‌మిశ్రా, మధుసూదన్‌రావు, వీరంరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాకపోకలకు బ్రేక్

మధిర: మధిర మండలం మడుపల్లి చెరువులోకి భారీగా వరద చేరింది. దీంతో అలుగు పోస్తుండగా మడుపల్లి – బయ్యారం గ్రామాల మధ్య చప్టాపైకి నీరు చేరింది. దీంతో బుధవారం రాత్రి రెండు గ్రామాల నడుమ రాకపోకలు నిలిపివేసిన అధికారులు మధిర టౌన్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఏరియా ఉత్తమ కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఉత్తమ ఉద్యోగుల వివరాలను బుధవారం ప్రకటించారు. బిరుదుకోట కుమారకృష్ణ (టిండాల్ పీవీకే–5 ఇంక్‌లైన్) ప్రకాశం స్టేడియంలో సీఎండీ చేతులు మీదుగా అవార్డు అందుకోనున్నారు. అలాగే అంకం రాజయ్య (కోల్ కట్టర్ పీవీకే–5 ఇంక్‌లైన్), పిల్లి శ్రీకాంత్ (ఈపీ ఆపరేటర్, జీవీఆర్ ఓసీ), వనమా వెంకటరమణ, ఫిట్టర్ (కిష్టారం ఓసీ), కొంటు సుధాకర్ (జనరల్ అసిస్టెంట్, కిష్టారం ఓసీ), దేగటి రాంబాబు (జనరల్ అసిస్టెంట్ ఆర్‌సీహెచ్‌పీ), ఎం.వెంకటరెడ్డి (ఎంవీ డ్రైవర్, జీవీఆర్ సీహెచ్‌పీ) ఎంపికయ్యారు.

యూరియా సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

కొణిజర్ల: రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో యూరియాకోసం రైతులు బారులు తీరి ఉండగా.. ఆమె రైతులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. రైతులు యూరియా కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని, సమస్య పరిష్కారానికై రైతులపక్షాన పోరాటానికి సిద్ధమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాధవరావు, నాగులుమీరా పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

తల్లాడ: స్థానిక బాలభారతి విద్యాలయంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. మన సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో కనువిందు చేశారు. కృష్ణుడు బాల్య క్రీడలకు సంబంధించిన ఘట్టాలను ప్రతిబింబించే గోవర్ధనగిరి, శ్రీ కృష్ణుడు జన్మస్థలం, బృందావనం, నమూనాలతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్ని కృష్ణులు ఉట్టి కొట్టారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ శ్రావణి, కెఎస్ఎం ప్రిన్సిపాల్ టి.రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల బారినపడకండి


కొణిజర్ల: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి


సత్తుపల్లిటౌన్: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీపీ అనిశెట్టి రఘు


మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

మధిర/సత్తుపల్లిటౌన్/కొణిజర్ల: యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడి, భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఏసీపీ అనిశెట్టి రఘు, ప్రిన్సిపాళ్లు బిజజైదాస్, ఎస్.గోపి పేర్కొన్నారు. సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. అదే విధంగా కొణిజర్లలోని తనికెళ్ల సమీపంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో.. ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు ప్రణీత్‌రెడ్డి విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం అందరు కృషి చేయాలన్నారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. ఎక్కడైనా మాదక ద్రవ్యాలు వినియోగం జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.గోపి, సీఐ శ్రీహరి, ఎస్సై ప్రదీప్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.తారియా, విజయ ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఆయేషా తరుణమ్, డీన్ శ్రీనివాసరావు, ఏఓ ఫరీద్ బాబా, జిల్లా మహిళా సాధికార కేంద్రం కోఆర్డినేటర్ ఎస్‌డీ సమ్రీన్, ఎంబీఏ కోఆర్డినేటర్ మానస అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం


సత్తుపల్లి పాతబస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సత్తుపల్లిరూరల్: కార్పొరేట్ల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని రైతు సంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్‌సెంటర్‌లో బుధవారం ప్రజా సంఘల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి ప్లేకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం కొలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు దోచి పెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. సుంకాలపై జరుగుతున్న చర్చల ప్రభావం వల్ల పొగాకు, మామిడి, శనగలు రైతాంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. మోదీ సర్కార్ సామాన్య ప్రజలపై భారాలు వేస్తూ.. కార్పొరేట్ శక్తులకు రాయితీలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మోరంపూడి పాండురంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జాజిరి శ్రీనివాస్, రావుల రాజబాబు, బడేమియా, భాస్కర్, రాములు, వలి, వెంకటేశ్వరరావు, నబీ, మీరాజ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి

కల్లూరు: ఈ నెల 18న కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు కోరారు. బుధవారం స్థానిక చింతలపూడి జగ్గయ్య భవన్‌లో.. దోమతోటి పుల్లయ్య అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే 60శాతానికి పైగా ప్రజలు వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తుంటే.. పాలక ప్రభుత్వాలు కార్పొరేట్లకు కట్టుబెట్టేందుకు కృషి చేస్తున్నాయన్నారు. శ్రమజీవుల హక్కులకై చేస్తున్న ఉద్యమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తన్నీరు కృష్ణార్జునరావు, నాయుడు చందర్‌రావు, రేస్ వెంకటేశ్వరరావు, రాజులపాటి కృష్ణారావు, రాజులపాటి కృష్ణవేణి, బీరవల్లి పెద్ద అంజి, రావి వెంకటసత్యం తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

ఏన్కూరు: రైతులు సేంద్రియ ఎరువులను వాడాలని, దీంతో భూసారం పెరగడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని వైరా ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మారావుపేట, ఏన్కూరు, తూతకలింగన్నపేట, జన్నారం గోడౌన్లను తనిఖీ చేసి మాట్లాడారు. నానో యూరియా, డీఏపీలను వాడాలని, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఎరువులు వేయొద్దన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నర్సింహారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు వితరణ


విద్యార్థులకు టై, బెల్టులు, బ్యాడ్జిలను అందించిన మాజీ సర్పంచ్ భద్రునాయక్

కారేపల్లి: మండలంలోని పోలంపల్లి గేటుతండా ప్రాథమికోన్నత పాఠశాల, పోలంపల్లి, మొక్కాళ్లగుంపు ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు మాజీ సర్పంచ్ ధరావత్ భద్రునాయక్ విద్యార్థులకు టై, బెల్టు, బ్యాడ్జిలతో పాటు, పెన్నులను వితరణగా బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను ప్రోత్సహిస్తే.. అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అజ్మీర వీరూనాయక్, అజ్మీర దస్రునాయక్, ధరావత్ రాములు, మాజీ సర్పంచ్ అలెం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు, ఫీల్డు అసిస్టెంట్ కోటేశ్వరరావు, ప్రభాకర్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసులు..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని పాతసెంటర్ పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సత్తుపల్లికి చెందిన ప్రముఖ వైద్యాధికారులు దాసరి దివాకర్ రెడ్డి, దాసరి విజయ బుధవారం ప్లేట్లు, గ్లాసులు వితరణగా అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, హెచ్ఎం బెజవాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సకాలంలో అందని యూరియా

వైరా: సకాలంలో రైతులకు యూరియా అందడం లేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. బుధవారం వైరాలో యూరియా కోసం రైతులు బారులు తీరగా యూరియా లోడు రాకపోవడంతో రైతులు సొసైటీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సదర్భంగా బొంతు రాంబాబు నిరసనకు మద్దతు తెలిపి మాట్లాడారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా రైతులకు యూరియా దొరికే పరిస్థితి లేదన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఏఓ మయాన్ మంజుఖాన్, సొసైటీ చైర్మన్ బొర్రా రాజశేఖర్‌లు రైతుల వద్దకు వెళ్లి గురువారం ఉదయానికి రైతులకు యూరియా లోడు అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఎంపీ జన్మదిన వేడుకలు

వైరా/సత్తుపల్లి రూరల్: కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి జన్మదిన వేడుకలను బుధవారం వైరాలో నిర్వహించారు. టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్ కేక్ కట్ చేశారు. నాయకులు శీలం వెంకటనర్సిరెడ్డి, బీడీకే.రత్నం, అన్వర్, నాగేశ్వరరావు, మిట్టపల్లి నాగి, రాముడు, రాజశేఖర్, వీరబాబు, రామకృష్ణ, సంతోష్, నాగరాజు, సత్యం, కిషోర్, సురేష్, వెంకన్న, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే, రేణుకాచౌదరి పుట్టిన రోజు సందర్భంగా సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ కేక్ కట్ చేశారు. మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్, నాయకులు గాదె చెన్నారెడ్డి, తోట సుజలరాణి, పింగళి సామేలు, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ స్టడీ సెంటర్లో డిగ్రీ అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కో–ఆర్డినేటర్ పూర్ణచంద్రరావు తెలిపారు. ఇంటర్, డిప్లొమా, ఓపెన్ ఇంటర్, ఐటీఐలలో ఏదైనా ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు అర్హులని తెలిపారు. ఆదివాసీ విద్యార్థులు, ట్రాన్స్‌జండర్స్, దివ్యాంగులకు రూ.500 ఫీజుతోనే డిగ్రీ విద్యను ఈ సంవత్సరం నుంచి విశ్వవిద్యాలయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సీసీరోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభం

కొణిజర్ల: మండలంలోని లింగగూడెం పంచాయతీలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మంజూరు చేసిన రూ.36 లక్షల నిధులతో.. చేపట్టిన సీసీ రోడ్డు, సైడ్‌డ్రెయిన్ నిర్మాణ పనులను వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు ధన్యావాదాలు తెలిపారు.

తల్లాడలో బుల్లిరాజు సందడి

తల్లాడ: సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో నటించిన బాల నటుడు బుల్లిరాజు బుధవారం తల్లాడలో సందడి చేశాడు. భీమవరం నుంచి హైదరాబాద్ షూటింగ్ వెళ్తూ మధ్యాహ్నం సమయంలో తల్లాడ మట్టమ్మ హోటల్‌లో భోజనం చేశారు. అనంతరం హోటల్ నిర్వహకులు, స్థానికులతో ఫోటోలు దిగి సందడి చేశాడు.